క్లుప్తంగా

విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలి



చిలకలూరిపేట: విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని ఇంటరాక్ట్ క్లబ్‌ల రీజినల్ చైర్మన్ అలంగార్ మోహన్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో పట్టణంలోని జీవీఐఎటీ, బ్రిలియంట్, హీలియస్ పాఠశాలల్లో ఆయా పాఠశాలల విద్యార్థులతో మూడు ఇంటరాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం అలవాటు చేసేందుకు ఇంటరాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేసి వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. చిననాటి నుంచే ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుంటే సమాజంలో సమస్యలు సమసిపోతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు, కార్యదర్శి దోరడ్ల మనోజ్, సింగారావు, రాజు, చెంచుపున్నయ్య, దాసునాయన, రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్రా- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలను 2023లో ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక వసతులు, అధ్యాపకుల కొరత ఉందనీ, వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్, అధ్యాపకులు డాక్టర్ నయీమ్, డాక్టర్ దీప, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలుగల వారికి అండగా నిలవాలి



చిలకలూరిపేట: ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు బాసటగా నిలచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని మద్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అవసరాలు గల బాలల ఉపకరణాల నిర్ధారణా శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు తల్లిదండ్రులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. శిబిరానికి మొత్తం 145 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, ఏడో వార్డు కౌన్సిలర్ చెమిటిగంటి పార్వతి, ఎంఈవో సత్యనారాయణసింగ్, జిల్లా ఐఈడీ కోఆర్డినేటర్ సల్వ రాజ్, ఐఈఆర్‌టీలు కె.విశ్వప్రసాద్, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోటీతత్వం అలవడుతుంది

చిలకలూరిపేట: క్రీడలతో ఆరోగ్యంతో పాటు పోటీతత్వం అలవడుతుందని ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం బి.కృపాదానం చెప్పారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏఎంజీ హైస్కూల్‌లో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ విశేషమైన క్రీడా ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చారని గుర్తు చేశారు. ప్రతివిద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ క్రీడాపోటీలలో ఆసక్తిగా పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసిన ఘనత మీది

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి

చిలకలూరిపేట: ఇచ్చిన హామీలను అమలు చేసే దిక్కులేకపోయినా, దివ్యాంగుల పింఛన్లను సైతం రద్దు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 6, 20 వార్డుల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పరిధిలోనే 255 మంది దివ్యాంగుల పెన్షన్లు రద్దు చేయడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోందని తెలిపారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదన్నారు. గడిచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని అయినప్పటికీ సుపరిపాలన పేరుతో ఇళ్లకు వెళ్లడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని ఎద్దేవా చేశారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారని వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచిందన్నారు ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ ప్రజలతో చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏకాంబరపు సునీత, దాసరి అంజలి, సయ్యద్ జమీర్, సాపా సైదావలి, షేక్ జాన్‌సైదా, ఈశ్వర్, అహమ్మద్, వాణి, సమీర, అంకమ్మరావు, ఆసిఫ్, ఖలీల్, వసీం, సత్తార్, అజగర్, రఫీ, అఫ్రోజ్, కరిమూన్, ఆశా, రియాజ్, సాదిక్, నాగరాజు, తులం ప్రసాద్, అక్బర్, సలాం, మస్తాన్‌వలి, బండారు జయకుమార్, గోపతోటి జాన్, కొండవీటి ఆంజనేయులు, ఇర్రి రాఘవ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయిస్తున్న దరియావలి

రోదసీయానంపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు



స్పేస్ డే శోభాయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: రోదసీయానంలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. జాతీయ రోదసీ దినోత్సవాన్ని పురస్కరించుకోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్స్ శనివారం ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఉపగ్రహ నమూనాలతో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విద్యార్థుల ఉపగ్రహ నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు అంతరిక్ష యానంపై అవగాహన పెంచుకోవడం ద్వారా దేశానికి సేవ చేసే అవకాశాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, హైస్కూల్ ఎన్‌సీసీ ఎన్‌కే ఫాతిమా, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఐడీపీఎస్ ఆధ్వర్యంలో శోభాయాత్ర

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో శనివారం స్పేస్ డే పురస్కరించుకొని పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గది చదువుతో పాటు సమాజంలో చోటుచేసుకునే పరిణామాలను పరిశీలించి అందుకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగోతు సవిత, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎం.భూపతి, 23 ఆంధ్ర బెటాలియన్ హవల్దార్ రాందేవా, కృష్ణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతలో శాస్త్రీయ చింతన పెంపొందించాలి

నరసరావుపేట రూరల్: యువతలో శాస్త్రీయ చింతన పెంచడం అత్యంత అవసర అని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ మెడికొండ రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ కేంద్ర మెమో 57 అమలు చేయాలి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం రాష్ట్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటిఎఫ్ పల్నాడుజిల్లా అధ్యక్షుడు బి.సంపత్‌బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ము కిషోర్, గౌరవ అధ్యక్షుడు పమ్మి వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర మెమో ఆధారంగా పలు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని వివరించారు. డీఎస్సీ నోటిఫికేషన్ 2004 సెప్టెంబర్ 1వతేదీకి ముందే విడుదలైనందున వారిని కొత్త పెన్షన్ విధానంలోకి తీసుకరావటం సహేతుకం కాదని తెలిపారు.

■ పంచాయతీలకు నిధులు ఇవ్వండి

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన ఏడాది అని చెప్పుకుంటున్నా గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయ నిధులు విడుదల చేయకుండా వాటిని అధ్వాన్నస్థితికి చేరుస్తుందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి పేర్కొన్నారు ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా సర్పంచులు, గ్రామాల అభివృద్ధికి ఒక్కపైసా విడుదల చేయలేదన్నారు.

■ 13న జాతీయ లోక్ అదాలత్

వినుకొండ: జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు వినుకొండ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13వ తేదీన స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, క్రిమినల్ కేసులు తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

■ ఘనంగా టంగుటూరి జయంతి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, ఇంచార్జ్ ఎంపీడీవో పి.సీతారామయ్య, పి.నాగేశ్వరరావు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ పట్టణంలో మాన్‌సూన్ హైజీన్ ర్యాలీ

నరసరావుపేట: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర మాన్‌సూన్ హైజీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పల్నాడురోడ్డులోని మున్సిపల్ హైస్కూలు నుంచి మల్లమ్మసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, ఇన్‌చార్జి కమిషనర్ రవికుమార్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మాన్‌సూన్ హైజిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీవో మ్యాథ్యూబాబు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి

నాదెండ్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటీష్ వారిని ఎదిరించి ఆంధ్రకేసరిగా బిరుదాంకితుడైన ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు సేవలు ఎనలేనివని హెచ్‌ఎం వి.వెంకటరావు చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటీష్ వారి తుపాకీకి తన గుండెను ఎదురొడ్డి నిలబడిన ధీరుడు టంగుటూరి అని పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ నిర్మాణం, పలు విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనతో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టంగుటూరికి నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం వెంకటరావు

పింఛను తగ్గించేశారయ్యా!



కనమర్లపూడి గ్రామానికి చెందిన ముక్కపాటి రాణి విద్యుదాఘాతానికి గురై అవయవాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆమె అంగ వైకల్యంతో మంచానికి పరిమితమైంది. భర్త కోటేశ్వరరావు అకాల మరణం చెందాడు. అత్త మామలు వృద్ధులు కావడంతో.. వచ్చే పింఛను డబ్బులతో ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తోంది. మూడు సంవత్సరాలుగా నెలకు రూ. 15 వేలు ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తోంది. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పింఛన్లు వెరిఫికేషన్ చేసి తన పింఛను రూ.6 వేలకు కుదించారని వాపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, జీవనం కష్టంగా మారిందని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. అధికారులు స్పందించి గతంలో మాదిరిగానే నెల వారీ పింఛను మంజూరు చేయాలని కోరుతోంది.

–శావల్యాపురం

నూతన వైద్యులకు వర్క్‌షాపు ఎంతో ఉపయుక్తం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: డిగ్రీలు పొంది నూతనంగా ప్రాక్టీసులోకి వచ్చిన డాక్టర్లకు డాక్టర్ కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న లైవ్‌సర్జికల్ వర్క్‌షాపు వలన చాలా ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కొండవీడు హాస్పిటల్‌లో డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన లైవ్‌సర్జికల్ వర్క్‌షాపు శనివారం రెండోరోజు కార్యక్రమాన్ని డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొత్తగా ఇఎన్‌టీ విభాగంలో వచ్చిన డాక్టర్లకు ఇది మంచి కార్యక్రమం అన్నారు. ప్రైవేటు హాస్పిటల్‌లో ఇటువంటి వర్క్‌షాపులు నిర్వహించటం చాలా అరుదైన విషయమని అన్నారు. సీనియర్ సర్జన్ల సమక్షంలో ఆపరేషన్‌లు చేస్తూ నేర్చుకోవటం డాక్టర్లకు మంచి సదావకాశమని అన్నారు. తాము కొత్తగా ప్రాక్టీసుకు వచ్చిన సమయంలో నేర్పించిన వారెవరూ లేరని అన్నారు. ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్న డాక్టర్ కంజుల అభినందనీయుడని పేర్కొన్నారు. నరసరావుపేటలో ఒక మెడికల్ ఫీల్డ్‌లో ఇటువంటి కార్యక్రమం చేయటం, ఈ కాన్ఫరెన్స్‌ను మెడికల్ కౌన్సిల్ గుర్తించి ఆరు క్రెడిట్ పాయింట్లు ఇవ్వటం దీని ప్రాముఖ్యతను తెలియచేస్తుందన్నారు. పిన్నమనేని సిద్దార్ధ మెడికల్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, మిర్యాలగూడ సీనియర్ ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ శేఖరరెడ్డి, గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ సుదీర్ చంద్ర పాల్గొని సేవలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీఎంసీ నుంచి అబ్జర్వర్‌గా కె.శ్రీనివాసరెడ్డి, క్యాంప్ ఆర్గనైజింగ్ డైరక్టర్‌గా డాక్టర్ కంజుల, క్యాంపు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ శ్రీవర్షిని వ్యవహరించగా, కాకినాడకు చెందిన డాక్టర్ శ్రీధర్, డాక్టర్ విష్ణురాజు, అనుభవిజ్ఞులైన ఈఎన్‌టీ నిపుణులు తమ సహకారం అందజేశారు.



సర్జికల్ వర్క్‌షాపులో డాక్టర్ కంజులతో డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామంలో కొలువైయున్న ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠం ఈ నెల 24 ఆదివారం నుంచి ప్రతి ఆదివారం ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు వేదాంత పరిచయం, భగవద్గీత అంతరార్థం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి కటారు దాసునాయన చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేయనున్న మఠాధిపతులతో కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేడు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం ఉదయం ఏడుగంటలకు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం ఏడు గంటలకు గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు హాజరు కావాలని కోరారు.

బాధిత రైతులకు పరిహారం అందజేయండి

కలెక్టర్‌ను కోరిన ఏపీ రైతుసంఘ నాయకులు, రైతులు

నరసరావుపేట: పేరేచర్ల – కొండమోడు జాతీయ రహదారి వల్ల నష్టపోతున్న బాధిత రైతులు అందరికీ న్యాయమైన పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాధిత రైతులతో కలిసి కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం వల్ల వందలాది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన రైతులు, ప్రజలు నష్టపోతున్నారని, ప్రధానంగా వ్యవసాయ భూములు, ఇళ్ళు, ఇళ్ల స్థలాలు నష్టపోతున్నారన్నారు. ప్రజోపయోగ సర్వీసుల పేరుతో రైతుల, పేదల ప్రయోజనాలను గాలికి వదిలేయడం ప్రభుత్వానికి సరైందికాదన్నారు. కావున అందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్మించేటటువంటి ప్రజాప్రయోగ ప్రాజెక్టుల కింద నష్టపోయే బాధితులకు సంతృప్తికరంగా పరిహారమిచ్చి ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల మహేష్, బాధిత రైతులు చుక్కపల్లి శ్రీనివాసరావు, యెల్లినేడి వెంకటేశ్వరరావు, దుగ్గినేని నరసింహారావు, మల్లంపూడి వెంకట్, జంపని అరవింద్, వెంకటస్వామి, సంగెపు శ్రీనివాసరావు, కందుల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నెల జైలు

నరసరావుపేట టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ సీఐ ఎం. హైమారావు శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పట్టణానికి చెందిన షేక్ హసన్ బుడే మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా నేరాన్ని అంగీకరించటంతో న్యాయమూర్తి నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. పట్టణంలో తరుచూ తనిఖీలు చేపడతామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

నాగశ్రీవల్లికి గణితంలో ఫస్ట్ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సీ–2025 ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని ఎ.నాగశ్రీవల్లి గణిత శాస్త్రంలో ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగశ్రీవల్లిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వై.యోగేశ్వరరావు, టీపీఓ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చట్టాలను దుర్వినియోగం చేయకండి



రొంపిచర్ల: చట్టాలను ఎలాంటి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయరాదని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుస్వామి అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో మండల న్యాయసేవా కమిటీ నరసరావుపేట ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ, ఎస్టీ గృహహింస చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టాలను దుర్వినియోగం చేయరాదన్నారు. నిజంగా అన్యాయం జరిగితే ఫిర్యాదు చేయాలని సూచించారు. అనవసర కేసుల వల్ల కుటుంబాలు బలైపోతాయన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సహాయ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మ్యాథ్యూబాబు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మునికృష్ణ, ఎంఈవో పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో న్యాయవాదుల రాష్ట్ర మహాసభలు



వినుకొండ: గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో ఈ నెల 30,31 తేదీ ల్లో నిర్వహించే ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వినుకొండ న్యాయవాద సంఘం అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక అసోసియేషన్ భవనం నందు మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి.జె.లూకా మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ సకాలంలో సత్వర న్యాయాన్ని అందరికీ అందించడం లక్ష్యంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, రమణరెడ్డి, శేఖర్‌బాబు, శివశంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గండిగనుముల నీటి సమస్యకు పరిష్కారం



బొల్లాపల్లి: నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఫిర్యాదు మేరకు అధికారులు శనివారం తండాల సందర్శించి సమస్యను పరిష్కరించారు. గండిగనుముల పై తండాలో నీటి ఎద్దడి ఉన్నందున, నూతన బోరు లెట్స్‌ను ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు ఇన్చార్జ్ ఎంపీడీవో పి.సీతారామయ్య తెలిపారు. తండాలో నీటి కొరత లేకుండా చూస్తామన్నారు. బోరు మోటర్ ఏర్పాటుతో నీటి సమస్య ఇబ్బందులు తొలుగుతాయన్నారు. బోరు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని జియాలజిస్ట్ పరిశీలించారని తెలిపారు.